
## 1974 ఆనంద దీపావళి కథల పోటీ

# ఆకలి

గోవిందు నర్సింహారావు



త్రవిటి నాయుడు అగరొత్తులు వెలిగించి- భక్తిపూర్వకంగా శ్రీమన్నారాయణ మూర్తికి దండం పెట్టేసేడు. ఖరీదైన అగరొత్తుల పరిమళంతో బస్సు పరవశించిపోతూంది.

"రైట్! ఎల్లనీ!" ఆర్డర్ చేసేసేడు క్లీనరు రామలింగం.

ఒక్క ఊపున పరుగందుకుంది బస్సు.

రోడ్డు మలుపులో స్టయిలుగా బస్సెక్కిన మా ప్రెసిడెంటు సీతారాం- నాకో నమస్కారం పారేసి- తవిటినాయుడి నమస్కారం అందీసుకొని- సుఖంగా నా పక్కన కూర్చుండిపోయాడు.

ఇంకా వేకువ రేకలు విచ్చుకుంటున్నాయి — బద్ధకంగా! ఏటివేపు కడవలతో పోతూన్న కాపు కులాంగనల్ని — కాడితో పోతున్న కర్షకుల్ని - దాటుకుంటూ — మా బస్సు మాంచి వేగంగా పోతోంది. అంగాంగంలో తారుణ్యం తొణికిసలాడే తరుణ ప్రకృతి ఒడిలోకి ఒది గొదిగిపోతూ, సంగీతంలాటి క్రమబద్ధమైన రొదతో, తలిరుటాకు తల్పాల తనువువాల్చి అలవోకగా నిద్రపోతూన్న పక్షి సంతానాన్ని మేలుకొలుపుతూ మా బస్సు కొత్తూరు చేరుకుంది.

సూర్యుడికి నిషాఎక్కి పోతూంది. రాగ మాదకత రేగిపోతూంది.

అయ్యరు కాఫీలతో నిషా ఎక్కించుకొని మా బస్సూ బయలుదేరింది నిండుగా.

రోడ్డు పక్కగా నిలబడ్డ ముసలిజంట "ఆపండాపండం"టూ చేతులెత్తారు.


"కాలీలేదు మావా! లాగించి" అన్నాడు మా రామలింగడు.

బ్రేకు వెయ్యబోతున్న తవిటినాయుడు ఆశ్చర్యంగా "అదేట్రా!" అని ప్రశ్నించాడు.

"కూకోడానికి సీట్ లేదు! ఆల్లేటి నించుంటారు. అందుకే లాగించి"

"బాగుందిరా నాయనా! చాలా బాగుంది. అయినా, నిన్నని ఏంపనిరయ్యా! రోజుల

# లేషన్ బహుమతి పొందిన కథ



లాగున్నాయి. ఇదే పడుచోళ్ళయితే నువ్వే బస్సు ఆపేసి-ఆళ్ళకి సీటు నేసేసి - సంబరంగా కూకోబెట్టీవా? కానికానీ" అంటూ లాగించేసేడు తవిటి నాయుడు.

బెంజి బస్సులా నవ్వాడు మా ప్రెసిడెంటు. లేలాండ్‌లాగయినా వంతపాడక తప్పిందికాదు.

"మేష్టర్రిబాబూ, గుజరాతల మినిస్ట్రీపడిపోనాదిగదా? బీహారుల సిద్ధంగున్నాదికదా! మరేటి సేస్తది మన ఇందిరమ్మ?" అని పృచ్ఛించాడు తవిటినాయుడు - రోడ్డుమీదే దృష్టి కేంద్రీకరించి.

ఇది మాకు ఇద్దరికీ అలవాటు. తవిటి నాయుడెప్పుడూ అధికార వర్గం వేపే వుంటాడు. నేనూ అటుమనిషినేనని అతడి నమ్మకం.

"ఈమాత్రం దానికి మన మేష్ట్రి లేట్రా! దారినపోయే ఏ ఎదవ నడిగినా సెప్పేస్తుడే!" అన్నాడు మా ప్రెసిడెంటు - "నన్నడుగురా వెధవా!-నేను రాజకీయాల్లో తిరుగుతున్నవాడ్ని" అనే భావం ధ్వనించేలా.

"లచ్చలు లచ్చల మంది సలితోటీ-ఆకలితోటీ సస్తా వుంటేనే అక్కర్లేని అమ్మకు-గుజరాతుల మినిస్ట్రిపోతేనేమిటి? ఆంధ్రదేశం అగ్గిలమాకెస్తేనేటి? ఇదంతా ఆవిడగ్గావాల! ఆ యమ్మ పదవి సల్లగుండాల! మా తలి!""అనిలేచాడు మాకమ్యూనిస్టురాజులు.

"ఒరే నాయనా రాజులూ, అలా తీసిపారేకురా, మరీ అంత యిదిగా తీసిపారేకు. పెజల ఆకలీ: పెజల బాదా ఆ యమ్మ కి తెల్దంటావా? ఆ యమ్మం మాత్రం కడుపు మండడం లేదంటావా? ఓ రాజులూ! ఆ యమ్మ ఆడదిరా! పిల్లల కాసిన తల్లిరా! గొడ్డుదికాదు. తల్లి కడుపుర నాయనా! కాని ఆ యమ్మ ఒక్కర్తే ఏటిసేస్తాది? నీయింటిని నువ్వే దిద్దలేకపోతున్నావు? ఈ దేశాన్నం తటినీ- ఈ కోటానుకోట్ల జనాన్ని దిద్దటమంటే. ఓరయ్యో రాజులూ- మాటలు కామురా! మినిట్లమీద జరిగి పోద్దనుకుంతన్నావా? మరీ అలా కొట్టిపారేకు!" అని డిఫెన్సు వాదన వినిపించుకున్నాడు- తవిటి నాయుడు- అలవాటుగా!

తవిటి నాయుడికి ముప్ఫయి ఏళ్ళుంటాయి. అంతకంటె ఎదిగిన మంచి మనసుంది. క్లీనరుగాఉంటూ డ్రయివింగు నేర్చుకుంటున్న తవిటి నాయుడ్ని మా ఊరి నాయుడొకడు మరేం ఊసుపోక బస్సొకటి కొనేసి - డ్రయివర్ని చేసేసేడు. ఆనాటి నుంచీ అది "తవిటి నాయుడి బస్సు" అన్న పేర్నమాత్రమే చలామణి అయిపోతోంది.

తవిటి నాయుడి బస్సు రాకకోసం రాత్రి పదిగంటల వరకూ షెడ్డు దగ్గిర మా ఊరి వాళ్ళు కొంతమందయినా కూర్చుంటారు. బస్సు దిగుతూనే ఎవరెవరు ఏమేం తెమ్మందీ వాళ్ళకే వివరించి, ఆయా వస్తువులూ మిగిలిన చిల్లర అప్పచెప్పేసి బస్సులో దేవుడికి వేసిన పూలదండ కుంటి పిల్ల సవరకు యిచ్చేసి యింటికెళ్ళే తవిటి నాయుడు అందరిచేతా మంచివాడు అనిపించుకుంటున్నాడు.

అతనుతెచ్చే చాకలెటకోసం అతని పెళ్ళాం నీలమ్మతోసహా మరో అయిదారుగురైనా ఆ వీధి కుర్రాళ్ళు మేలుకుని ఉంటారు. అలాటి తవిటి నాయుడికి పిల్లల్లేరు.

పేపరు చదవడం అతని అలవాటు, తన అనుమానాలను నివృత్తి చేసుకోవడం — తన జ్ఞాన పరిధిని విస్తృత పరచుకోవడం కోసం— ఆ విషయాలు తెలిసిన వాళ్ళతో చర్చించడం అతనికి డ్రయివింగ్ తర్వాత అత్యంత యిష్టమైన పని.

అయితే-ఎంత మాట్లాడుతున్నా- ఎవరు చెప్పింది ఎంత జాగ్రత్తగా వింటున్నా- అతని దృష్టి రోడ్డుమీదే ఉంటుంది.

అతడి పన్నెండేళ్ళ సర్వీసులో ఒక్క యాక్సిడెంటూ జరగలేదు. అతని బస్సు క్రిందపడి చిన్న కోడిపిల్లయినా చావలేదు. అతని అదృష్టమో — లేక అతని నైపుణ్యమో-కాని అది సత్యం.

బస్సు మెట్టూరు దాటింది.

మా ప్రెసిడెంటు అరపెట్టె బర్కిలీ తెప్పించి నాకూ, తవిటి నాయుడికీ చెరోటి యిచ్చి తనొకటి వెలిగించాడు.


ఆరోజు హీరమండలం సంత. బస్సులో ఓ వందపై చిలుకు టిక్కెట్లున్నాయి. రోడ్డు మీద సంతకు వెళ్తున్న పశువుల మందలున్నాయి.

రోడ్డు అలికిడిగా-సందడిగా-ఉంది.

తవిటి నాయుడు కబుర్లాపేసి చాలా మెలుకువతో బస్సు నడిపిస్తున్నాడు. బస్సు యమ సందడిగా ఉంది. ఓ మూల రాజకీయాల రణగొణధ్వని — ఓ పక్క పిల్లల ఏడుపులు—ఓ వంక తల్లుల సముదాయింపులు—మరో కెలకున కండక్టరు అదిలింపులు—టిక్కెట్టు డబ్బులకై వేధింపులు.

"ఏటమ్మీ బస్సు! మడిసిమీద మడిసి నెక్కించేస్తున్నారు. సంటిపిల్లలు సచ్చూరుకుంటారు గావాల. ఏటి సేతును?"

"ఓసి ఇంతోటి పిల్లల్ని నువ్వే కన్నావమ్మా! మరి మాకేం పిల్లా పాపా ఉన్నారా! కూకోవమ్మా! సర్దుక్కూకో! పిల్లల్ని సంపేడం మాకేం సరదా అనుకుంతన్నావేటి? కూకో" సర్దుతున్నాడు క్లీనరు రామలింగం.



జననం : 13-7-1946. దూసి. శ్రీకాకుళం జిల్లా. తండ్రి : శ్రీ జి. రామమూర్తి, తల్లి : శ్రీమతి సీతమ్మ.

శ్రీకాకుళంలో B.sc. పాసయి. వాల్తేరులో M. A. (లెక్కలు) చదివి డిగ్రీ పుచ్చుకోకుండా వచ్చేశాను. ప్రస్తుతం వెదుళ్ళవలస ఉన్నతపాఠశాలలో లెక్కలమాష్టారుగా బయట- శ్రీమతి రాజ్యలక్ష్మికి. చిరంజీవులు అరవింద్ మరియు మధురిమలకు భర్త మరియు తండ్రిగా యింట- ఉద్యోగం. కథలు చదవడం. వ్రాయడం. పాఠాలు చెప్పడం. పాటలు వినడం అంటే సరదా! కృష్ణశాస్త్రి లిద్దరూ : బుచ్చిబాబు. రావిశాస్త్రి. లత. పురాణంల రచనలంటే ప్రాణం. దాదాపు 10కథలు భారతి. ఆంధ్రప్రభ, జ్యోతి. జయశ్రీలలో ప్రచురించబడ్డాయి. ఆంధ్ర జ్యోతిలో మాత్రం యిదే మొదటిది.

గోవిందు నరసింహారావు

---

"జరిగితే యిప్పుడు జరగాలి యాక్సిడెంటు. మా రంజుగుంటుంది. తిండేదని అడిగేవాళ్ళు మన జిల్లాకు వందమంది తగ్గుతారు. ఏలినవారికి కొంత తలనొప్పి తగ్గుతుంది"

"తప్పు నాయనా! అలాటి ఓగాయిత్యం మాటలు హాస్యానికైనా అనకూడదు."

"ఫర్వాలేదు సార్! మనమన్న మాటలు నిజాలై కూర్చునేందుకు- మనమేం సత్యహరిశ్చంద్రులమా: విశ్వామిత్ర మునీంద్రులమా! మీరలాంటి భయాలేం పెట్టుకోకండి! ఈ దేశంలో చావు ఒక వరం సార్! దానికెంత అదృష్టం చేసుకోవాలనుకుంటున్నారు! ఒక్కరైనా మనలో ఆ అదృష్టవంతులుంటే చెప్పేయండి బాబూ! వారితో బాటే మమ్మల్ని ఈ లోకంనుంచి రిలీవు చేయిస్తున్నందుకు తర్వాతెలాగూ అవకాశం ఉండదు కాబట్టి. ఎడ్వాన్సుగానే థాంకుస్ చెప్పేసుకుంటాం."

'ప్రేమలు పెళ్ళిళ్ళు బాగులేదు. వెళ్ళకు. నాగేశ్వరరావు తగలెట్టేసేడు."

"ఇందిరాగాంధీకి రోజులు బాగులేవండీ! బాడ్ పీరియడ్"

"ఆహా.... అయ్యోపాపం! చాలా మంచి మనిషేనే"

"రామరామ"

కయ్‌మంటూ ఒక్కసారి బ్రేకులు పడ్డాయి. ఆ ఊపుకి బస్సులోని టిక్కెట్లన్నీ తలో మూలకి విసిరివేయబడ్డారు. పెద్ద శబ్దం పక్కలోనె బాంబు పేలినట్లు. "సచ్చిపోయాం రయ్యో" అనే కేకలు రేగాయి. ఆర్తనాదాలు మిన్నుముట్టాయి. అలజడి చెలరేగింది. మనుషులమీంచే మనుషులు దూకేస్తున్నారు. దెబ్బలు తగిలిం చేసుకుంటున్నారు.

ఈ సందట్లో పసిపిల్లలు చచ్చినంతపనీ చేసేస్తున్నారు.

ఈ గొడవలో మేముండగానే గెంతేసేడు తవిటి నాయుడు.

ఒక్కఊపున ఎవర్నో భుజాన వేసుకుని పరుగెడుతున్నాడు.

వెనకాలే మనుషులు పరుగెడుతున్నారు.

"నా కొడుకుని సంపేసి నార్రయ్యో" అని ఓ పాతికేళ్ళ ఆడమనిషి పరుగెడుతోంది.

అంతా అల్లకల్లోలంగా అస్తవ్యస్తంగా అగమ్యగోచరంగా ఉంది.

ఈ అలజడిలోంచి నన్నెలాగో తప్పించేసి గవర్నమెంటు డిస్పెన్సరీకి తీసికెళ్ళిపోయాడు మా సీతారాం.

అప్పటికే తవిటి నాయుడు పిల్లడితో చేరుకున్నాడు. ఆపిల్లాడ్ని టేబుల్ మీద వేసేసేరు. రక్త ప్రవాహంతో రబ్బరుగుడ్డ తడిసిపోతోంది.

అలవాటుగానే డాక్టరుగారు లేరు. పేకాటకి వెళ్ళి శ్రీకాకుళం నుంచి ఇంకా తిరిగి రాలేదట.

దొరికిన కాంపౌడరు ఏదో యింజక్షను చేయడానికి సర్దుకుంటున్నాడు.

కాని ఆ అవసరం రానీకుండా — ఆ పిల్లాడు యీ లోకాన్ని విడిచిపెట్టేసేడు.

తవిటినాయుడు కుప్పలా కూలిపోయాడు.

శాపనార్థాలు పెడుతూ ఆతల్లి ఆ రక్తపు ముద్దమీదపడి ఏడుస్తోంది.

మేమంతా మతులుపోయి నిల్చుండిపోయాం.

ఓ అరగంటలోగా ఊరి పెద్దలూ — పోలీసు పెద్దలూ గుమిగూడేరు.

పంచాయతీ మొదలెట్టారు.

"ఆ గుంటడి నావుకి ఈ డయివేరు ఎదవ ఒంటి మత్తే కారణం'' అని తీర్పు మొదలెట్టి—

''కాబట్టి ఆ గుంటడి కుటుంబానికి-ఆళ్ళ కడుపు పంటను కాల్చేసినందుకు ఈ డయివరు ఎదవ రెండు యేల రూపాయ లిచ్చీయాల'' అని జడ్జిమెంటు చెప్పేసేరు-ఆ ఊరి ప్రెసిడెంటూ-పేరుమోసిన ధాన్యం వ్యాపారీ అయిన వరహాల్రాజుగారు.

"పెసిరెంటు సెప్పింది మా సక్కగున్నాది'' అనీసేరు మిగిలిన పెదలు. తల లూపీసేరు పోలీసు పెద్దలు.

''అదేటండీ? మీరే పెడర్లూ. మీరే జడ్జీలూ అయిపోతే నాయమెలాగొస్తాది. రెండుయేలు పట్టుకొచ్చి యిచ్చీమంటే-ఎటి క్కాడ డబ్బు చవగ్గా పండుతుందనుకుంతన్నారా?" అంటూ కదిలాడు మా ప్రెసిడెంటు సీతారాం.

''మరయితే మా ఊరి గుంటలే చవగ్గా దొరుకుతున్నారేటి - బస్సులకింద పడేసి మట్టించిడానికి.''

''నాయనా! నువ్వింతా నూసినట్టే మాట్లాడికు! ఈ తవిటి నాయుడెవడో, ఎలాటోడో మా ఊరు ఊరందరికీ తెల్సు! తెల్దా! ఆడి బస్సుకిందపడి కోడిపిల్ల సచ్చిందన్న పిర్యాదులేదు. అంత రిమార్కులేని మనిసాడు" అన్నాడు మా సీతారాం.

"అయితే మా ఊరోళ్ళు రిమార్కున్న మనుషులంటావా?"

"నేనేమి అనడంలేదు నాయనా! కసింత ఆగమంటన్నాను. ఒక్క నిమిషం ఆలోచించమంటన్నాను. ఆళ్ళపిల్లడు సచ్చిపోనాడు. నిజంగా గోరమే జరిగిపోనాది. అయితే రోడ్డుమిదికి ఆ గుంటడి నొదిలీటంలో ఆళ్ళ తప్పునేదా? రోడ్డుమీద బస్సు లిరుగతన్నాయని ఆళ్ళ పెదలకి తెల్దా? ఈ యాళ సంతరోజని తెల్దా? ఇంత తెలిసీ ఆళ్ళేటి సేసినారు? అది సూడండి. మా వోడేం తాగీసున్నాడా? అరవయిమైళ్ళ ఫీడున ఎల్తున్నాడా? అదీ సూడండి. ఆ తర్వాత మీరు ఏ శిచ్చవేసినా మేంసిదమే" అన్నాడు సీతారాం.

"రోడ్డు మీదికి గుడిసెలున్నవాళ్ళ పిల్లలు మరెక్కడాడుకుంతారు నాయనా?" ఎవరో అడిగారు.

ఓ పది పదిహేను నిముషాలు పెదల మధ్య మంతనాలయాయి.

"తవిటి నాయుడూ! పదేను వంద లిచ్చేయండి. కేసూ ఉండదు శిచ్చా ఉండదు. లేదూ;మరాటికి సిద్దంగా ఉండండి"అని తుది తీర్పు చెప్పేసేరు వరహాల్రాజుగారు.

"ఈ కబురు మీ పొప్పరయిటరుకి సెప్పురా రామలింగా" అని సీతారాం అర్డరు వేసబోతూంటే కండక్టరు కాను ప్రాబ్లం సిద్ధంగా ముందుకు దూకబోతూంటే.

"ఆగండి బాబూ! నామా టినండి. ఆళ్ళ పిల్లడు పోనాడు. నా బస్సుకింద పడి సచ్చిపోనాడు. అవకాశముంటె నా పేణ మిచ్చయినా బతికించి యిచ్చేవోడ్ని. ఆ అదృషం నాకు రాసిలేదు. రెండు ఏలుకాదు. లచ్చ రూపాయి లిచ్చినా ఆళ్ళ కిడుపుమంట సల్లారుదా? ఆళ్ళబాద తిగ్గిపోతాదా? బాబూ సీతారాంబాబూ: రెండుయేల రూపాయిలే గదా బాబూ ఆళ్లు అడిగినారు. నువ్వు లచ్చ రూపాయి లిచ్చినా మా కక్కర్లేదు మా పిల్లడే మాకు గావాల అని ఆళ్ళంటే నా నెక్కడ్నుంచి తీసుకురాను బాబూ! నేనే అగ్గిల దూకాల బాబూ! బాబూలంతాయినండి. మా పొప్పరయిటరు బాబుకి దీనితో సంబంధం లేదు. ఆ బాబీ యాక్సిడెంటు సెయ్యలేదు. నేను సేసి నాను. రేపీయేలకి రెండుయేళ రూపాయిలూ నేను తెచ్చి వరహాల్రాజుబాబుకిస్తాను బాబూ!నన్నొగ్గేయండి".

వెనక్కి తిరిగి చూడకుండా పిచ్చివాడిలా ఏడుస్తూ- మొహం చేతుల్లో కప్పేసుకుని పరుగెడుతున్న తవిటి నాయుడికేసి కళ్ళప్పగించేసి మతులుపోయి అలా నుంచుండిపోయాం.

శ్రీకాకుళం వెళ్లానేకాని మనసు నిలవ లేదు. అంతా కెలికేసినట్టుగా ఉంది. ఏపనీ జరిగిందికాదు.

తిరుగుటపాలో నేనూ, సితారాం కలిసి వస్తూ దాన్ని గురించే చర్చించుకున్నాం.

ఇంజన్ ట్రబుల్ కారణంగా హీరమండలంలో బస్సు ఆగిపోయింది. "ఓగంట టయిముంటుంది సార్" అని కండక్టరు చెప్పాడు.

"పిల్లడుపోయిన దుఃఖంలో ఉన్నారు. ఓసారి చూసివద్దాం పద" అని నేనంటే సరేనని సీతారాం బయలుదేరేడు.

లోపల్నించి ఏడుపు వినిపిస్తోంది. పాపం- తల్లి కాబోలు.

మేం గుమ్మం దగ్గరే ఆగాం.

"ఒల్లకోయ్! ఓ సొల్లకోయ్! సెప్పిన మాట యినే! ఎటే యిది? నాకుమాత్రం బాద నేదేటి? నా గుండె మాత్రం మండిపోవడం నేదేటి? నానుమాత్రం మడిసి కానేటి?నానుమాత్రంకడుపుఏడవడంనేదేటి? మరేటి సేసీమంతావ్? ఏ అగ్గిల దూకీమంతావ్? నన్నెక్కడ సచ్చిపోమంతావే? పోనీ నాను సస్తే ఆడు బతికొస్తాడా? అట సెప్పే నాను సత్తాను. ఏటిసేత్తేమాత్రం సచ్చినోడు బతికొస్తాడు? అయినా ఆ ఎదవ బతికి ఏ రాజ్జాలేలీయాల? ఏ బోగాలను బవించీయాల? నాలుగు పూటల్నించి తిండి లేనేలేదుకదా. - జొరంతో నువ్వు తొంగున్నావుకదా! ఎపుడేనా ఏమీతలిసినాడా? ఇందరాఅని కాన్డబ్బులిచ్చినాడా? నువ్వుసచ్చినావో బతికినావో అడిగినాడా? దొరికిన్నాడు గంజీ లేన్నాడు నీళ్ళుతాగి ఆ ఎదవ బతికే బతుకేటి అందలసుకమేటి? ఆడు బతికుంటేనే సాలంటావా? నిజమేనే! అయితే ఒక్కటాలోసించు. ఆడు బతికి మన్నేం సుకపెటీయాల! ఆడు సచ్చినందుకు సంతోసించే-ఆడూ సుకపడ్డాడు-మన్నీ సుకపెట్టాడు. రెండు యేలు కడుపు నింపుతాయే పిచ్చిముండా! అంత డబ్బు సంపాయించలేంగాని-పిల్లల్ని కనలేమా? రెండు యేల రూపాయలే! సంపాయించడం మాట దేవుడెరుగు-అంత డబ్బుని మన కళ్ళతో సూడలేమే! ఒస్! అసలేటి జరిగినదాయినే! నాను టీ తాగుతన్నాను. ఆడు రోడ్డుమీదే ఆడుకుంతన్నాడు. బస్సు రావడమూ. ఆడు దానికాడికెళ్ళడమూ నాను సూసినాను. ఏదో సెక్రం రాసుకుపోది- సిన్న దెబ్బేదో తగుల్తాది- మొన్నమనఎల్లిగాడి బొటెడికిచ్చినట్లే. ఏదో పరికో పారేస్తారని ఊరుకున్నానే! ఆడు సచ్చూరుకుంటాడని అనుకోనేదే! నీకాడ అబద్దం సెప్పనేక సెప్పేసినానే! ఆడు సచ్చిపోతాడని అనుకోనేదే! ఒలే! నన్ను నమ్మే! నానూ కన్నానే ఆ ఎదవని నమ్మే."

నన్నెలా నడిపించుకు వెళ్లాడో-నేనెలా బస్సులో కూలబడ్డానో నాకు తెలీదు. ★

[మనుషుల్నింత నీచస్థితికి దిగజార్చేదేదయితే ఉందో-ఆ ఆకలికే ఈ కథ అంకితం. —రచయిత]

వార్తలకు. వ్యాఖ్యలకు
"ఆంధ్రజ్యోతి"
దినపత్రికనే చదవండి

మహిళలకు శుభవార్త!
శాఖాహార. మాంసాహార కూల్ డ్రింక్సు
250 వివిధరకాల వంటకాలనుగురించిన
వంటలు-వార్పులు -6-00
M. జయలక్ష్మి.
రూ-7/50. M.O చేసినరిజిష్టర్ పోస్టులో
పంపబడును. V.P. పద్ధతిలేదు.
క్వాలిటీ పబ్లిషర్స్
విజయవాడ-2